

# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాలు హరిచందనాలు

విజయ చావలి


అమ్మ,నాన్న

సృష్టిలో తీయనిది అమ్మ. అమ్మ అంటే ప్రేమ, అనురాగం, ఆప్యాయత, సహనం, త్యాగం, దగ్గరితనం అన్నీ గుర్తుకొస్తాయి.

"అ" అంటే అమ్మని ఉన్న మొదటి తరగతి తెలుగు వాచకంలో మొదటి పేజీలో మొదటి అక్షరం వత్తి "అమ్మ" అని వత్తి గట్టిగా పలికినప్పుడు నాకు తెలియలేదు, అమ్మకి అక్షర క్రమంలో ఎందుకు ప్రాధాన్యతనిచ్చారో?? రాను రాను తెలిసింది సృష్టిలో ప్రేమమూర్తి, అనురాగమయి, త్యాగశీలి, సహనవర్తి, ఆప్యాయతల అమృతవల్లి, అనుబంధాలకు ఆది తల్లి ముమ్మాటికీ అమ్మే అని.

ఈ శరీరాన్నిచ్చి రూపాన్నిచ్చింది అమ్మ. ప్రేమతో పాలిచ్చింది, పాలించింది, పెంచింది, పెద్ద చేసింది. చిన్నప్పుడు ముద్దులాడింది లాలించింది అమ్మ.

మా అమ్మ పేరు గండికోట సత్యవతి. వారి ఊరు చోడవరం. చోడవరానికి నేతలాంటి మా తాతగారు దుర్వాసుల సీతారామ్మూర్తిగారు పెద్ద ప్లీడరు. వారిది పెద్ద కుటుంబం. వారి రెండవ కుమార్తె మా అమ్మ. మా తాతగారిని మేమెప్పుడు చూడకపోయినా చిన్నతనం రోజులు వ్యవహారాలు వివిధ సందర్భాలలో వింటూ ఉండేవాళ్ళం. మధ్య మధ్యలో కునుకులు తీస్తూ ఉండే వంట మనిషికి వండి వార్చడమే పని. ఇంటికి ఎవరు ఎప్పుడు వచ్చినా విస్తట్లో భోజనం చేయకుండా లేచేవారు కాదట. గుర్రం బండిలో రోజూ కోర్టుకి వెళ్ళే తాతగారు చేతికి ఎముక లేకుండా ఎవరికైనా ఏ సహాయమైనా కాదనకుండా చేసేవారట. పండగలొస్తే ప్రతివారికి నలుగులు పెట్టి తలస్నానాలు చేసే కార్యక్రమాలు.. వాటి మధ్య పండగ సంబరాలు.. అమ్మ ద్వారా ఆశ్చర్యంగా వింటూ ఉండేవాళ్ళం.

ఆమె పాసైంది స్కూల్ ఫైనల్. కాని నేర్చింది బి.ఏ అంత చదువు. అక్కడ అప్పట్లో హైస్కూలు వరకే ఉంది. చదువుకోవడం ఆడుకోవడం తప్ప ఏమీ తెలీని అమ్మకి నాన్నగారితో పంతొమ్మిదో ఏటనే వివాహమయింది.

నాన్నగారు గండికోట విశ్వనాథం గారు. విద్యారీత్యా లాయరు చదువు చదివినా, వృత్తి రీత్యా సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయినా, ప్రవృత్తి రీత్యా తెలుగు సాహిత్యాభిలాషులు.

ఇక మామ్మ చిట్టెమ్మకి చాలామంది పిల్లలు పుట్టి పోగా మిగిలినవారు ముగ్గురమ్మాయిలు ఒక్క కొడుకు. తండ్రి లేని లోటు తెలియకుండా వ్యవహారాల్లో, పొదుపరితనంతో అప్రమత్తంగా ఉంటూ తెలివితేటలతో నిర్దుష్ట వైఖరితో మా నాన్నగారిని గారాబంగా పెంచారు. అమ్మాయిలకి పెళ్ళిళ్ళు చేయడం, పురుళ్ళు పోయడంతో పాటు నాన్నగారిని చదివించడం ఒక చిన్న ఇల్లు అనకాపల్లిలో ఏర్పాటు చేయడానికి ఎన్నో కష్టాల కోర్చింది. అటువంటి మామ్మ దగ్గిర మడిగా వంటలు చేయడం, పూజలు వ్రతాలు పద్ధతిగా నేర్చుకోవడంతోపాటు నలుగురి పిల్లల సంరక్షణ తెలుసుకుంటూ సరిదీటైన కోడలిగా ఎదుగుతూ అత్తగారి దగ్గర మన్ననలందుకుంది మా అమ్మ. వచ్చిపోయే ఆడపడచులు, అన్నగార్లను ఆదరిస్తూ ప్రేమాభిమానాలు సంపాదించింది.

ఏది వండినా ఒక స్పెషల్ ఐటం ఎక్కువగ కొడుక్కి మాత్రం చేసేదట మామ్మ. వయసులోనే ఉన్న అమ్మకిది అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టిందట. సాయంత్రం కాగానే భారత భాగవతాలు చుట్టుపక్కల వారికి వినిపించమని అత్తగారి ఆజ్ఞ అయితే రాగయుక్తంగా చదవడం కోడలి పని.

చుట్టుపక్కల అమ్మలక్కలు నలుగురి పిల్లల తల్లి అయినా చీర కొనుక్కోవడానికి అత్తగారిని ఎందుకు అడగాలని అమ్మకి సలహాలు చెప్పినా, తిరిగి అదే విషయం అత్తగారికి చెప్పి తనేం అలా అనుకోవటం లేదని అమాయకంగా చెప్పిందట అమ్మ.

మామ్మ ఆశీర్వాదాల వలనే మనమింత వృద్ధిలోకి వచ్చామంటుంది అమ్మ. అమ్మ చెప్పే ఇంకో విషయం: ఎండలో పెట్టిన వస్తువుకి, అత్తగారి దగ్గర మసలిన కోడలికి చెడడం ఉండదని.

మేం నలుగురం పిల్లలం. ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరు అమ్మాయిలు. అన్నయ్య మామ్మ దగ్గరే ఏడేళ్ళవరకు పెరిగాడు. మిగిలిన మా అందరికి మామ్మవి చిరుజ్ఞాపకాలు మాత్రమే. మామ్మ పోయినపుడు అందరికంటే ఎక్కువ బాధపడింది అమ్మే. మామ్మ దగ్గిర అమ్మకు సహనం, త్యాగం, పొసెసివ్‌నెస్, పూజలు, మడి చాదస్తాలు అలవడ్డాయి.

నాన్నగారు లా చదువుతున్నప్పుడు కంటికి దెబ్బ తగిలి చదవలేకపోతుంటే అమ్మ ఇంగ్లీషులో చదివి వినిపిస్తే ఆ వాక్యాలు మళ్ళీ పలికి పరీక్ష వ్రాసి పాసయానని తన ఏకసంథాగ్రాహి లక్షణాన్ని చెపుతూ ఉంటారు.

మా నలుగురి పైన మా తలిదండ్రులిద్దరి ప్రభావం చాలా ఉంది. అమ్మతో చనువుగా ఏదైనా మాట్లాడగలం. మా నాన్నగారి దగ్గర అందరికి భక్తి భయం గౌరవం ఉన్నాయి. యుక్త వయసు వచ్చే వరకు నాన్నగారి ప్రేమ తీరు ప్రేమ అర్థం తెలియలేదు ఎందుకంటే నాన్న ప్రేమని చేష్టలలో చూపిస్తారు కాని మాటలలో చూపరు. ఎదురుగా ప్రేమగా మాట్లాడకపోయినా మా కోసం ఆయన పడే తపన, తిట్టినా దాని అంతరార్థం మా అమ్మ విడమర్చి చెప్పేది. అందువలన మా అందరికి ఒకరినొకరు ప్రేమించుకోవడం, సహరించుకోవడం అలవాటయ్యాయి. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండడం ఆడదాని చేతిలోనే ఉంటుందంటే అతిశయోక్తి కాదు.

అమ్మ నాకు లెక్కలు పదవతరగతి వరకు చెప్పేది. రోజూ కాసేపు ఇచ్చిన లెక్కలు చేయకపోతే ఊరుకునేది కాదు. నాకు లెక్కలలో మంచి మార్కులు రావటానికి అమ్మే కారణం. రోజూ లెక్కలు నేలమీద చాక్పీస్‌తో చేయాలి. నాకు బాగా గుర్తు. వర్గ మూలాలు చెపుతున్నప్పుడు కేవలం ఎక్కాల జ్ఞానంతో దగ్గరే ఉన్న మా అత్త తిరిగి చెప్పగలిగారు...

ఇక పండగలొస్తే సాంప్రదాయానుసారం యధావిధిగా అన్నీ పొద్దున్నే చేయల్సిందే ఆ అలవాటులన్ని ఇప్పుడు నేను సంతృప్తితో పాటిస్తున్నాను. వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి, దసరా పండగలలో నేను చెల్లెలు అమ్మ వెనకే వంటలో సాయం చేసేవారం.

నా బలహీనత పుస్తకాలు చదవడం. ఎలాంటి పుస్తకమైనా కనపడితే చదవకుండా తోచదు. నాన్నగారిని ఒప్పించి సెలవుల్లో విధిగా గ్రంధాలయాలు (ఇంటికి వచ్చేవారు) నుండి నాకు కావల్సినవి ఏరుకోనిచ్చేది.

ఇక ఒక్క క్షణం తీరిగ్గా కూర్చోకుండా పిల్లల కిష్టమైనవి ఏదో ఒకటి చేస్తూ ఉండేది. వెంటనే మిగిలిన వారు నీ ముద్దుల కొడుక్కి చేసావా, ముద్దుల కూతురికి చేసావా అనేవాళ్ళు. పిల్లలని కోపగించుకోగా ఒక్కనాడు చూడలేదు.

మా నాన్నగారికి రెండూ లేదా మూడేళ్ళలోసారి ట్రాన్స్‌ఫర్ అయి ఊళ్ళు మారల్సి వచ్చేది. ఏ ఊరికి వెళ్ళినా అక్కడ కొత్త వారితో పరిచయాల వలన మా కందరికి కూడ ఎక్కడికక్కడ సరిపెట్టుకునే అనగా ఎడ్జస్టబుల్ టెంపరమెంట్ అలవడింది.

ఇక నాన్నగారి సాహిత్యాభిలాషతో వ్రాసే పద్యాలు కవితలు మా అందరితో పంచుకుంటూ ఉండడం వలన నేను చెల్లెలు ఎం.ఏ తెలుగు చదవడమే కాక కవితాధోరణులు అలవడ్డాయి.

వృత్తిరీత్యా కూడ ఎదగడానికి ఎంతో సహకరించింది.

రిటైరైనాక నాన్నగారు భద్రాద్రి సీతాపతి శతకం, మారుతి శతకం వ్రాసారు. మా నాన్నగారి ప్రోత్సాహంతో సప్తగిరి టి.విలో పద్యాల అంత్యాక్షరి - పద్యాల తోరణంలో అమ్మ పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకుంది. తన ప్రథమ సంపాదన అని గర్వంగా చెపుతుంది. ఇక ఇంకా భక్తి టి.విలో తరతరాల తెలుగు పద్యం పోటీకి వరసలో ఉంది.

మా నలుగురి పిల్లలకి మాత్రమే కాక మా పిల్లలకి కూడ ఏది సాధించాలన్నా వయసేమి అడ్డం కాదని, వృద్ధాప్యంలో హాబీలుండాలని వారిద్దరు స్ఫూర్తి కలిగిస్తున్నారు. ఇక ఇప్పుడు కాలనీలో లలిత విష్ణు సహస్రనామ పూజలలో, వ్రతాలలో ముఖ్యపాత్ర వహిస్తూ ఉంటుంది.

నాకు మంచి కవితలు చదివి స్పందించినపుడు భక్తి విషయాలు ఆస్వాదించినపుడు నన్ను పెంచిన తలితండ్రులని తలుచుకుని గర్వపడతాను ఎందుకంటే వారి పెంపకం వలనే నాకీ అదృష్టం కలిగిందని భావిస్తాను.

ఇటీవల శ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారు సిడ్నీ వచ్చినపుడు లలిత వైభవం ప్రస్తావిస్తూ అమ్మ గురించి చెప్పారు. అమ్మ అంటే "ఒక చీర కట్టుకున్న ఆడది" అని ఎంతమంది అంగీకరిస్తారు అనడిగారు. అమ్మ వివిధ రూపాలు లలన, ప్రేమతో కడుపునిండా భోజనం పెట్టేటపుడు, ప్రోత్సాహంతో మెచ్చుకునేటపుడు, బాధను పంచుకునేటపుడు, చెడు పనులు చేసినపుడు కోపగించుకునేటపుడు, ఇంటికిరానివారికోసం ఎదురుచూసేటపుడు, బేలగా మాట్లాడేటపుడు, విడమర్చి చెప్పారు. ఇవన్నీ అమ్మరూపాలుగా అనుభవంలోకి రాని వ్యక్తి ఎవరూ ఉండరని నేను నమ్ముతాను. ఆయన చెప్పిన ప్రవచనాలు విని ఆస్వాదించగలిగినపుడు నా అనుభూతి వర్ణనాతీతం. వారిపై చిన్న కవిత వ్రాసి అందరితో పంచుకోకుండా ఉండలేకపోయాను. అదే సందర్భంలో నిజంగా ఇలాటి అనుభూతి కలగడానికి కారణం నా కుటుంబమే అనిపించి వెంటనే అమ్మ నాన్నకి ఫోన్ చేసి చెప్పాను.

ప్రేమ ఆప్యాయతలు పంచిపెట్టి

మంచి చెడులు వివరించి

అవకాశాలు అందించి

జీవన విలువలు బోధించి

బలహీనతలు భరించి

బాధ్యతలను వరించి

మంచి తోడు వెదికిచ్చి

సహకారం మాకిచ్చి ప్రగతి సాధనకు వయసేమి అడ్డం కాదని

నిరూపించిన పద్యధారణ ద్వయాలు అమ్మా నాన్నలు.

ఏభై వసంతాలు వివాహమహోత్సవం

ఇటీవలే జరుపుకున్న అమ్మా నాన్నలకి

శుభాభినందనలు

స్ఫూర్తి కలిగించే ఈ శీర్షికలో పాలుపంచుకునే అవకాశం నాకిచ్చిన కిరణ్‌ప్రభ గారికి కృతజ్ఞతలు.



విజయగారు గత పదిహేడేళ్ళుగా సిడ్నీలో భర్త శివప్రసాద్, పిల్లలు శరత్, సంజయ్ లతో నివాసం. చదివింది సైన్సు బి.యి.డి., తెలుగులో డిగ్రీ. చేసేది గవర్నమెంటాఫీసులో ఉద్యోగం. అడపాదడపా సిడ్నీ పత్రిక వాహినిలో రచనలు ప్రచురితమౌతుంటాయి.